AKSHARA TODAY


అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

23-10-2026 (Friday) MAIN EDITION

వీక్ మార్కెట్‌లోనూ అదరగొట్టిన ఐపీవో..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: బలహీన మార్కెట్‌లోనూ డిఫెన్స్ సెక్టార్‌కు చెందిన టోన్బో ఇమేజింగ్ కంపెనీ ఐపీవో అదరగొట్టింది. కంపెనీ షేర్లు 66 శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యాయి. కంపెనీ ఐపీవో ద్వారా మొత్తం రూ. 852.18 కోట్లు సమీకరించింది. ఒక్కో ఈక్విటీ షేరును రూ.700 లకు విక్రయించగా.. ఎన్ఎస్ఈలో రూ. 460 ప్రీమియంతో రూ.1,160 వద్ద.. బీఎస్ఈ లో రూ. 462 ప్రీమియంతో రూ.1,162 వద్ద లిస్ట్ యాయి. ఐపీవో అలాట్ అయినవారికి లిస్టింగ్ సమయంలోనే సుమారు 66 శాతం లాభాలు వచ్చాయన్న మాట.

రూ.720 ఆశ చూపి.. రూ.6 లక్షలు కాజేసిన కేటుగాళ్లు



అక్షరటుడే, సికింద్రాబాద్: పార్ట్ టైమ్ ఉద్యోగం, భారీ లాభాల పేరుతో సైబర్ నేరగాళ్లు మరో గృహిణిని మోసగించారు. హోటళ్లకు ఆన్‌లైన్ రివ్యూలు ఇచ్చే పనులంటూ నమ్మించి, సుమారు రూ. 6 లక్షలకు పైగా నగదు కాజేశారు. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ వారాసిగూడ ప్రాంతానికి చెందిన 39 ఏళ్ల మహిళ ఈ సైబర్ మోసానికి బలయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బెట్టింగ్ యాప్స్‌పై ఈడీ ఉక్కుపాదం



అక్షరటుడే, ఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ , గేమింగ్ యాప్స్ మోసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఉత్తరాది, పశ్చిమ భారతంలో గత వారం నిర్వహించిన మెరుపు దాడుల కొనసాగింపుగా.. తాజాగా తెలుగు రాష్ట్రాల్లోనూ ఈడీ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు.

రణ్‌బీర్ కపూర్ వాచ్ ధర తెలిస్తే షాకే!



అక్షరటుడే, సినిమాడెస్క్: భారతీయ సినీ పరిశ్రమలో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న అగ్ర కథానాయకులలో రణ్‌బీర్ కపూర్ ఒకరు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'రామాయణం' మూవీ ఈవెంట్‌లో ఆయన ధరించిన ఓ ప్రత్యేకమైన వాచ్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. భారత మార్కెట్లో ఈ వాచ్ వెల సుమారు రూ. 35.88 లక్షలు ఉంటుంది.

హాస్టల్ గదుల్లో 'యాంటీ సూసైడ్' ఫ్యాన్లు



అక్షరటుడే, గుజరాత్: , ఆత్మహత్యల నివారణకు గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన 'వీర్ నర్మద్ సౌత్ గుజరాత్ యూనివర్సిటీ' ఒక కీలక అడుగు వేసింది. హాస్టల్ గదుల్లో విద్యార్థులు ఉరివేసు కొని బలవన్మరణాలకు పాల్పడకుండా చూసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన 354 'యాంటీ సూసైడ్ ఫ్యాన్లను' ఏర్పాటు చేసింది.

కశ్మీర్‌లో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ జిల్లా ఒక గుహలోని ఉగ్రవాద స్థావరాన్ని భద్రతా దళాలు గుర్తించాయి. భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. ఆరు ఐఈడీలు, ఒక 7.62 LMG మ్యాగజైన్, ఒక కంబాట్ పౌచ్, ఒక అల్యూమినియం కంటైనర్, విద్యుత్ వనరులతో కూడిన రెండు పవర్ అడాప్టర్లు, టిఫిన్ బాక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాదులు టిఫిన్ బాక్స్‌లో బాంబు పెట్టి పేల్చడానికి ప్రణాళిక వేసి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

కూకట్‌పల్లిలో భారీ అగ్నిప్రమాదం



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. హరిజన సేవా సంఘం కాలనీలో గురువారం రాత్రి దోమల నివారణ కోసం పొగ పెట్టారు. దీంతో మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న గుడిసెలు, కట్టెల డిపోకు మంటలు అంటుకున్నాయి. దీంతో అవి కాలిబూడిదయ్యాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నాలుగు ఫైరింజన్లతో సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడగా.. వారిని ఆస్పత్రికి తరలించారు.

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున సరాక రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్ అయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

■సీఎం రేవంత్‌రెడ్డి ■కుల గణనపై కీలక వ్యాఖ్యలు ■ఘనంగా పండుగ సాయన్న జయంతి

గడ్డపోతారం సరాక ఫ్యాక్టరీలో ఏపీకి చెందిన కార్మికులు సుదర్శన్ రావు (27), బాలాజీ (44) నైట్ డ్యూటీ విధులు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 3 గంటలకు పరిశ్రమంలో గ్యాస్ లీక్ అయింది. దీంతో ఊపిరాడక వాళ్లు ఇద్దరు అక్కికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీక్‌కు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

గ్యాస్ లీక్ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలన్నారు. పరిశ్రమల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసింగ్ విధానాలు మారాలి : సీఎం రేవంత్‌రెడ్డి



అక్షరటుడే, హైదరాబాద్ : మెరుగైన సమాజానికి ప్రజా భద్రతే పునాది అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న దక్షిణ ప్రాంతీయ పోలీస్ సమన్వయ కమిటీ సమావేశ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రజల భద్రత, రక్షణను నిర్ధారించడానికి పటిష్టమైన అంతర్రాష్ట్ర పోలీసు సమన్వయం, సమర్థవంతమైన పోలీసింగ్ అవసరం అన్నారు. మారుతున్న నేరాలను ఎదుర్కోవడానికి పోలీసింగ్ విధానాలు మారాలన్నారు. సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం, , నక్సల్ రహిత రాష్ట్రం దిశగా పురోగతితో తెలంగాణ ప్రజా భద్రతలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని అన్నారు. ప్రజా భద్రత అనేది కేవలం శాంతిభద్రతలకు మాత్రమే పరిమితం కాదని, అది ప్రాణాలను, జీవనోపాధులను, ప్రజా ఆస్తులను కాపాడటంతో పాటు సమ్మిళిత పురోగతిని కూడా నిర్ధారిస్తుందని తెలిపారు.

భద్రతే అభివృద్ధికి పునాది : భట్టి విక్రమార్క



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : భద్రతే అభివృద్ధికి పునాది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అమీన్‌పూర్‌లో జరిగిన టీజీఎస్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సుమారు 2,000 మంది సిబ్బందితో తెలంగాణ వ్యాప్తంగా 67 కీలక సంస్థలను కాపాడటంలో ఈ దళం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తెలంగాణను సురక్షిత, సమృద్ధ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో టీజీఎస్పీఎఫ్ పాత్ర కీలకమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు.

రాహుల్ గాంధీకి ఎన్ని జాకీలు పెట్టిన లేస్తలేడు : కేటీఆర్



అక్షరటుడే, హైదరాబాద్ : లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ ఎంత చేసినా లాభం లేదన్నారు. ఆయనకు ఎన్ని జాకీలు పెట్టినా లేస్తలేడని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. దేశంలో కాంగ్రెస్ విఫలం కావడంతోనే, యువత సీజేపీ పేరుతో పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ నాయకులను బీజేపీ బెదిరించగలదు కానీ, యువతరాన్ని కాదన్నారు. ప్రస్తుతం బీజేపీ బలహీనంగా మారిందని ఆయన అన్నారు.

ఆసియా పారా గేమ్స్‌లో భారత్ రికార్డులు




అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : జపాన్‌లో జరుగుతున్న పారా ఆసియా గేమ్స్‌లో భారత క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నారు. శుక్రవారం ఏకంగా మూడు ప్రపంచ రికార్డులను నమోదు చేశారు. పురుషుల 400 మీటర్ల పరుగులో భారత క్రీడాకారులు సందీప్ కుమార్ స్వర్ణ పతకాన్ని, అజయ్ కుమార్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. సందీప్ 52.28 సెకన్లలోనే గమ్యాన్ని చేరుకొని ప్రపంచ రికార్డును నెలకొల్పారు. జావెలిన్ త్రోలో హేనీ 60.49 మీటర్ల భారీ దూరం విసిరి కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పి స్వర్ణం సాధించాడు. బ్యాడ్మింటన్ ఫైనల్‌లో భారత క్రీడాకారులు నితేష్ కుమార్, ప్రమోద్ భగత్ తలపడ్డారు. నితేష్, ప్రమోద్‌ను 2118, 2116 తేడాతో ఓడించి, వరుస సెట్లలో విజయం సాధించాడు. దీంతో అతడు బంగారు పతకం, ప్రమోద్ సిల్వర్ మెడల్ సాధించారు.

సొంత సైనికుల మృతదేహాలను తీసుకోని పాక్



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : తీవ్రవాదం, మత స్వేచ్ఛ, మైనారిటీ హక్కుల వంటి అంశాలపై పాకిస్థాన్ అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జమ్మూ కాశ్మీర్ వ్యవహారాల గురించి, ఇతర అంతర్గత అంశాల గురించి మాట్లాడే నైతిక హక్కు పాక్‌కు ఏమాత్రం లేదని స్పష్టం చేసింది. ఐక్యరాజ్య సమితిలో భారత ప్రతినిధి భావికా మంగళానందన్ మత స్వేచ్ఛ, నమ్మకం అనే అంశంపై చర్చలో పాల్గొన్నారు. 1999 కార్గిల్ యుద్ధంలో మరణించిన తమ సైనికుల మృతదేహాలను స్వీకరించడానికి కూడా పాకిస్థాన్ నిరాకరించిందని గుర్తు చేశారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలను సైతం సమర్పించారు.

ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో కారు దగ్ధం



అక్షరటుడే, ఖమ్మం : ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో కారు దగ్ధమైంది. కొత్తగూడెం వైపు వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. మహబూబాబాద్‌కు చెందిన వారు కారులో కొత్తగూడెం వైపు వెళ్తున్నారు. ఖమ్మంలోని కలెక్టరేట్ వద్దకు రాగానే.. కారులో పొగలు రావడాన్ని వారు గమనించారు. వెంటనే పక్కన నిలిపి బయటకు వచ్చారు. అనంతరం క్షణాల్లోనే కారు పూర్తిగా కాలిపోయింది.